
సాక్షి గుంటూరు

మంగళవారం । 16 । ఏప్రిల్ । 2024



నూకలమ్మ విగ్రహ ప్రతిష్ట

తెనాలిఅర్బన్: ముత్తెంశెట్టిపాలెంలోని శ్రీ నూకలమ్మతల్లి దేవస్థానంలో సోమవారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు.




సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటి మట్టం సోమవారం 509.00 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,882, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5000, గరిష్ట ధర రూ.6800, మోడల్ ధర రూ.5800 వరకు పలికింది.



న్యూస్‌రీల్

శోభా రథయాత్రను విజయవంతం చేయాలి



పట్నంబజారు: శ్రీరామనవమిని పురస్కరించుకుని చేపట్టనున్న శోభాయాత్రను జయప్రదం చేయాలని శ్రీరామ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు కారంశెట్టి లోకేష్ కోరారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో విలేకరుల సమావేశంలో సోమవారం మాట్లాడారు. ఆరేళ్లుగా శోభా రథయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలందరికీ శ్రీరాముని ఆశీస్సులు అందజేసే విధంగా యాత్ర కొనసాగుతోందని తెలిపారు. యాత్రలో గుంటూరు జిల్లాకు సంబంధించి రామభక్తులు వేలాదిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి ఉదయం 9.11 గంటలకు శోభా రథయాత్ర ప్రారంభమవుతోందని, ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ కృష్ణమోహన్, పలువురు ప్రజాప్రతినిధులు, పెద్దలు హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో శ్రీరామ ఉత్సవ కమిటీ సభ్యులు బ్రహ్మారెడ్డి, తియ్య వేణుగోపాల్(హిందూ), అడపా ఫణీంద్ర, తూనుగుంట్ల రాజేష్, సాయి, మధు, రాజేష్, ప్రవీణ్, యశ్వంత్ పాల్గొన్నారు.

అదనపు జిల్లా జడ్జిగా ఎన్. సత్యశ్రీ

నరసరావుపేట టౌన్: 13వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా ఎన్. సత్యశ్రీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె నెల్లూరు అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన న్యాయమూర్తి ఓ. వెంకట నాగేశ్వరరావు రిటైర్ అయ్యారు. ఖాళీగా ఉన్న స్థానంలో సత్యశ్రీ నియమితులయ్యారు.

11న జాతీయ లోక్ అదాలత్

మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 11న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్. సత్యశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడదగ్గ క్రిమినల్, సివిల్ కేసుల్ని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కక్షిదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

యార్డులో 1,32,603 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,32,603 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,22,620 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.17,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 19,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 84,395 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.2.76 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ.2.76 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులుగా సమర్పించారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను సోమవారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 19 రోజులకు గాను హుండీల ద్వారా రూ.2,76,11,524 నగదు, 478 గ్రాముల బంగారం, 4.830 కిలోల వెండి లభ్యమైంది. కానుకలు, హుండీల లెక్కింపును ఆలయ ఈవో కేఎస్ రామారావు పర్యవేక్షించగా, ఆలయ, సేవా సిబ్బంది పాల్గొన్నారు. ఈ హుండీల ద్వారా రూ.70,541 విరాళాలను దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారికి సమర్పించారు. హుండీలలో నగదుతో పాటు వివిధ దేశాలకు చెందిన కరెన్సీని భక్తులు కానుకలుగా సమర్పించారు. యూఎస్ఏకు చెందిన 1451 డాలర్లు, ఇంగ్లాండ్‌కు చెందిన 110 పౌండ్లు, కెనడాకు చెందిన 85 డాలర్లు, యూఏఈకి చెందిన 110 దిర్హమ్స్‌లతో పాటు ఇతర దేశాలకు చెందిన కరెన్సీ లభించింది.

ప్రజల గుండెల్లో జగన్‌కు స్థానం

- చెరగని ముద్ర వేసుకున్న నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
- చరిత్రలో నిలిచేలా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి
- విలువలున్న నాయకులెవరూ కూటమిలో ఇమడలేరు
- నీతి, నిజాయతీ ఉన్న నాయకులంతా వైఎస్సార్ సీపీలోకే....
- రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న ప్రతిపక్ష నాయకులు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని





గుంటూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని, వేదికపై చందు సాంబశివరావు, టీవీ.రావు, వీరిశెట్టి, తదితరులు

పట్నంబజారు: ప్రజల గుండెల్లో మంచి చేసే వారికి మాత్రమే ఎప్పటికీ స్థానం ఉంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు గత శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ క్రమంలో సోమవారం వారితో కలసి చంద్రమౌళినగర్‌లోని కార్యాలయంలో మంత్రి రజిని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో ఎన్నో గొప్ప విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి, చరిత్రలో నిలిచిపోయే పాలన అందించారని చెప్పారు. ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, ఇటువంటి గొప్ప పాలనలో తాను భాగస్వామిని అయినందుకు తనకు ఎంతో గర్వకారణంగా ఉందని చెప్పారు.

జగనన్న పాలన అంటే ఏమిటో పెత్తందారులకు అర్థం కాదని విమర్శించారు. తమ పాలనలో ఎంత మంచి జరిగిందో, ప్రజలు ఎంత మేలు పొందారో... ఆ ఫలాలు పొందిన వారందరికీ తెలుసునని చెప్పారు. రైతులు, మహిళలు, విద్యార్థులు... ఇలా ఎవరిని అడిగినా జగనన్న పాలన గొప్పతనం గురించి తడముకోకుండా చెబుతారని వెల్లడించారు. మంచి చేసే ప్రభుత్వానికి, నాయకులకు ప్రజలు ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన మంచిని చూసే ఈ రోజు వివిధ ప్రతిపక్ష పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు తమ పార్టీలో చేరారన్నారు. వారందరినీ తాను మనస్ఫూర్తిగా తమ పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలనతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, ఈ సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

నవరత్నాలతో పేదల అభ్యున్నతి

బీజేపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన నేత చందు సాంబశివరావు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎంతగానో దోహదం చేశాయని చెప్పారు. సచివాలయాల ద్వారా పరిపాలనను గ్రామస్థాయికి తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామ స్వరాజ్యం దిశగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. సమాజంలో అసమానతలు తొలగించడానికి సీఎం జగన్ పడుతున్న తపన చూసి, తాను కూడా ఆయనతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నానని వివరించారు.

పవన్ కల్యాణ్ విధానాలతో విసుగుచెంది..

జనసేన రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా పనిచేసి వైఎస్సార్ సీపీలో చేరిన వీరిశెట్టి సుబ్బారావు మాట్లాడుతూ జనసేన పార్టీలో రెండు నెలలుగా జరుగుతున్న పరిణామాలతో విసుగు చెంది ఆ పార్టీకి రాజీనామా చేశానని చెప్పారు. పవన్ కల్యాణ్ జనసేన పార్టీ నాయకులను చంద్రబాబు పల్లకీ మోసే బోయిలుగా పనిచేయమంటున్నారని, అది సహించలేకే అసలుసిసలైన జనసేన నాయకులంతా ఆ పార్టీ నుంచి బయటకు వస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని అన్నారు. ఇటీవల పార్టీలో చేరిన గుంటూరు నగర కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు షేక్ ఉస్మాన్ టీడీపీకి చెందిన సాజిద్ అలీ, దొంతా నాగగౌడ్ అజయ్ తదితరులు తాము ఆయా పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలో ఎందుకు చేరామో వివరించారు. సమావేశంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆయా డివిజన్ల అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, మండల ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి

బీజేపీ రాష్ట్ర మేధావుల విభాగం కో-కన్వీనర్‌గా పనిచేస్తూ పార్టీలో చేరిన టీవీ రావు మాట్లాడుతూ కరోనా కాలంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ప్రజలకు ప్రధానంగా కావాల్సినవి కూడు, గూడు, విద్య, వైద్యం అని చెప్పారు. గడిచిన ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ ప్రధానంగా వీటిపైనే దృష్టి పెట్టారని తెలిపారు. వీటితోపాటు రాష్ట్రంలో కొత్తగా 17 వైద్య కళాశాలలు ఏర్పాటుచేశారని, నాలుగు పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్‌లు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. ఇంతకంటే అభివృద్ధి ఇంకా ఏముంటుందని అన్నారు. వచ్చే ఎన్నికలలో పశ్చిమ నియోజకవర్గంలో మంత్రి రజిని గెలుపు కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు.

ముగిసిన అంతర్ వైద్య కళాశాలల క్రీడా పోటీలు



పోటీల్లో అత్యధిక పతకాలు సాధించిన ఆశ్రం జట్టు

ఏలూరు రూరల్: ఏలూరు ఆశ్రం వైద్య కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ అంతర కళాశాలల మహిళల ఆటల పోటీలు సోమవారం ముగిశాయి. వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ఆశ్రం చైర్మన్ గోకరాజు గంగరాజు, జి.రతీదేవి, ఆశ్రం మెడికల్ డైరెక్టర్ కె.అంజిరెడ్డి సీఈఓ కె.హనుమంతరావు, సూపరింటెండెంట్ కె.శాంతయ్య షీల్డ్, మెడల్స్ అందజేశారు. విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. వాలీబాల్‌లో విజయనగరం ఎంఐఎంఎస్ జట్టు ప్రథమస్థానం, గుంటూరు మెడికల్ కాలేజ్ జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. బాస్కెట్‌బాల్‌లో డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాల ప్రథమస్థానం, ఎస్ఆర్ఐ మెడికల్ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. బ్యాడ్మింటన్‌లో ఆశ్రం మెడికల్ కాలేజీ ప్రథమస్థానం, రాజమండ్రి జీఎస్ఎల్ కాలేజీ రెండో స్థానం, త్రోబాల్‌లో రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ ప్రథమ, విశాఖపట్టణం ఎన్ఆర్ఐ కాలేజ్ ద్వితీయ, బాల్ బ్యాడ్మింటన్‌లో ఆశ్రం మెడికల్ కాలేజీ ప్రథమ, అనిల్ నీరుకొండ డెంటల్ కాలేజీ రెండో స్థానం, టేబుల్ టెన్నిస్‌లో శ్రీకాకుళం గ్రేట్ ఈస్టర్న్ మెడికల్ స్కూల్ ప్రథమ, విశాఖపట్టణంకు చెందిన గాయత్రి హెల్త్‌కేర్ కళాశాల ద్వితీయ స్థానం, టెన్నిస్ విభాగంలో విశాఖపట్టణం ఎన్ఆర్ఐ కళాశాల ప్రథమ, చిన్నకాకాని ఎన్ఆర్ఐ కళాశాల ద్వితీయ, చెస్‌లో కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల జట్టు ప్రథమ, రాజమండ్రి జీఎస్ఎల్ కళాశాల జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

కిలారి, శివకుమార్‌లకు నీరాజనం



తెనాలిలో నిర్వహించిన పాదయాత్రలో అభివాదం చేస్తున్న కిలారి, అన్నాబత్తుని శివకుమార్

- కదంతొక్కిన పార్టీ కార్యకర్తలు, అభిమానులు
- అడుగడుగునా హారతులు, పూలవర్షం
- ప్రచారం ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు



ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు గుమ్మడికాయతో మహిళల హారతులు

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ నియోజకవర్గంలో రోడ్‌షోకు సోమవారం శ్రీకారం చుట్టారు. సాయంత్రం 6.30 గంటలకు ఆరంభమైన పాదయాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కదం తొక్కారు. మహిళలు హారతులు, గుమ్మడికాయలతో దిష్టి తీస్తూ, పూలవర్షం కురిపించారు. గజమాలలతో సత్కరించుకుని తమ అభిమానాన్ని చాటుకున్నారు. వివిధ వర్గాల మహిళలు, స్థానికులు, వ్యాపారవర్గాలు అభ్యర్థులను సత్కరించారు. చేతులు కలుపుతూ 'మా ఓటు మీకే నన్నా' అంటూ భరోసానిచ్చారు. తొలుత పట్టణ చినరావూరు పార్కు వద్ద నుంచి రోడ్‌షో ఆరంభమైంది. ముందుగా అక్కడ సర్వమత ప్రార్థనలు చేశారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార గీతం సీడీని ఆవిష్కరించారు. జనానికి అభివాదం చేస్తూ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కిలారి వెంకట రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్‌లు పాదయాత్రలో నడిచారు. పాదయాత్రలో కుర్రా శ్రీను దంపతులు హారతులివ్వగా, స్వరాజ్ టాకీస్ సెంటర్లో కాళిదాసు విజయసత్యం ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం పలికారు. ఉషోదయ మాల్ వద్ద కఠారి హరీష్ నాయకత్వంలో, వీనస్ టాకీస్ వద్ద భాస్కరుని లక్ష్మీనారాయణ, మద్దాళి శేషాచలం నేతృత్వంలో, గాంధీచౌక్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ నాయకత్వంలో క్రేన్లతో అభ్యర్థులను గజమాలలతో సత్కరించారు. పలువురు వ్యాపారులు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. రాత్రి 8.30 గంటల సమయంలో మున్సిపల్ మార్కెట్ సెంటర్‌కు పాదయాత్ర చేరుకుంది. అక్కడి పురవేదికపై గల జాతినేతల విగ్రహాలకు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్, శివకుమార్ తనయుడు, జూనియర్ సత్యనారాయణలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రోడ్‌షో పార్టీ పరిశీలకుడు మందపాటి శేషగిరిరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, మాజీ చైర్మన్లు సయ్యద్ ఖలేదా నసీమ్, ఆలమూరి విజయలక్ష్మీకుమారి, తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, కొల్లిపర ఎంపీపీ భీమవరపు పద్మాంతి సంజీవరెడ్డి, పట్టణ, మండల, కొల్లిపర మండలాల పార్టీ అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, అవుతు పోతిరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, పార్టీ నేతలు బొమ్ము శ్రీనివాసరెడ్డి, బొంతు నరేంద్రరెడ్డి, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, షేక్ ఫరీద్, అవుతు శేఖరరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, గుదిబండి కృష్ణకిశోర్‌రెడ్డి, పేరం సంజీవరెడ్డి, బూరెల దుర్గాప్రసాద్, తాడిబోయిన రమేష్, జేబీ జిలాని, కాకి దేవసహాయం, మన్నవ ప్రభాకర్, మన్నవ శాంతిశ్రీ, ప్రసాదం బాలగురవమ్మ, తాడిబోయిన రామయ్య, రావి ప్రశాంతి, రావి శ్రీనివాసరావు, పినపాలి అనిల్, పెసర్లంక రమణ, కుర్రా జస్వంత్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గుండెకు భరోసా

- గుంటూరు జీజీహెచ్‌లో 24గంటలు క్యాథ్‌ల్యాబ్ వైద్యసేవలు
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం
- అందుబాటులో మెదడు, కాళ్ల రక్తనాళాల పూడిక వైద్యం



గుంటూరు పెద్దాసుపత్రిలో ఏర్పాటు చేసిన క్యాథ్‌ల్యాబ్ మిషన్

గుంటూరు మెడికల్: హార్ట్ స్ట్రోక్ వస్తే ప్రాణాలు గాల్లో కలిసి పోతాయి. ఆధునిక జీవనశైలి వల్ల నేడు చిన్న వయస్సులో కూడా హార్ట్ స్ట్రోక్ వస్తుందని కార్డియాలజిస్టులు తెలియజేస్తున్నారు. పగలు, రాత్రి, తెల్లవారుజామున ఇలా ఏ సమయంలో హార్ట్ స్ట్రోక్ వస్తుందో ఎవ్వరూ ముందస్తుగా ఊహించి చెప్పలేని పరిస్థితి. హార్ట్ స్ట్రోక్ ఏ సమయంలో వచ్చినా మేము మీకు 24 గంటలు అందుబాటులో ఉండి మీ గుండెకు భరోసా కల్పిస్తామని గుంటూరు జీజీహెచ్ కార్డియాలజిస్టులు అభయమిస్తున్నారు.



వార్డులో చికిత్స పొందుతున్న రోగులు(ఫైల్)

పూర్తి ఉచితంగా గుండె ఆపరేషన్లు

గుంటూరు జీజీహెచ్‌లో గుండెజబ్బు రోగులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రోగులకు గుంటూరు జీజీహెచ్ కార్డియాలజీ వైద్య విభాగంలో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా క్యాథ్‌ల్యాబ్ వైద్యసేలను అందిస్తున్నారు. గుండెజబ్బుల వైద్య విభాగంలో 24 గంటలు క్యాథ్‌ల్యాబ్ వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. దీంతో గుండెజబ్బు రోగులకు సకాలంలో వైద్యసేవలు అందుతున్నాయి. గుండెపోటు వచ్చిన వారికి త్వరగా యాంజియోగ్రామ్ చేసి వ్యాధి నిర్ధారణ చేయటం ద్వారా సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడవచ్చని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు.

24 గంటలు క్యాథ్‌ల్యాబ్ సేవలు

కార్డియాలజీ క్యాథ్‌ల్యాబ్ వైద్య విభాగంలో గుండె జబ్బురోగులకు 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండి గుండె ఆపరేషన్లు చేస్తున్నారు. కార్డియాలజిస్టులు, కార్డియాలజీ పీజీ వైద్యులు క్యాథ్‌ల్యాబ్ వైద్యసేవలు అందిస్తున్నారు. వైద్యులతోపాటుగా నర్సింగ్ సిబ్బంది, ఇతర పారామెడికల్ సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండి గుండెపోటు రోగులకు సత్వరమే మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నారు.


ఉచితంగా కార్పొరేట్ వైద్యం

2018 డిసెంబర్‌లో జీజీహెచ్‌లో ఫిలిప్స్ కంపెనీకి చెందిన అజురియన్ 7.సి అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్ మిషన్‌ను నూతనంగా ప్రారంభించారు. 2019లో 3,926 మందికి, 2020లో 2,885 మందికి, 2021లో 899 మందికి, 2022లో 1,580 మందికి, 2023లో 1,670 మందికి, 2024 మార్చి నెల వరకు 250 మంది గుండెజబ్బు రోగులకు యాంజియోగ్రామ్‌లు చేసి అవసరమైన వారికి స్టంట్‌లు వేశారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు, తెల్లరేషన్ కార్డు ఉన్న వారితోపాటుగా ఏ కార్డు లేని వారికి కూడా ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్నారు.

కేంద్ర ప్రాజెక్ట్‌లో భాగంగా ఏర్పాటు

విజయవాడకు చెందిన లక్ష్మీఆరుష్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్(పీపీపీ) విధానంలో జీజీహెచ్‌లో క్యాథ్ ల్యాబ్ మిషన్ ఏర్పాటు చేసింది. నీతి ఆయోగ్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఏపీలో క్యాథ్‌ల్యాబ్‌ను మొట్టమొదట గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటుచేసినట్లు సంస్థ ప్రతినిధి, కార్డియాలజిస్ట్ డాక్టర్ బొర్రా విజయ్‌చైతన్య తెలిపారు. సుమారు రూ.4.5 కోట్లతో ఏర్పాటుచేసిన ఆధునిక క్యాథ్ ల్యాబ్‌తో 50శాతం రేడియేషన్ తక్కువగా ఉంటుందన్నారు. క్లియర్ స్టంట్ విధానం ద్వారా స్టంట్ వేసే సమయంలోనే ఖచ్చితమైన ప్రదేశంలో స్టంట్‌ను అమర్చే సౌకర్యం నూతన క్యాథ్‌ల్యాబ్‌లో ఉన్నట్లు వెల్లడించారు.

గుండెకు ఆధునిక వైద్య సేవలు



కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా హార్ట్ స్ట్రోక్ బాధితులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేస్తున్నాం. గుండెపోటు వచ్చిన వారికి అత్యాధునిక వైద్య పద్ధతుల్లో సత్వరమే ఆపరేషన్లు చేసి ప్రాణాలు కాపాడుతున్నాం. జీజీహెచ్ క్యాథ్‌ల్యాబ్‌లో కార్డియాలజీ వైద్యసేవలతోపాటుగా న్యూరో రేడియాలజీ వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చాం. మెదుడు రక్తనాళాల్లో పూడికలు, కాళ్ల రక్తనాళాల్లో ఏర్పడే పూడికలు తీసివేసి స్టంట్‌లు వేస్తున్నాం. ఎలాంటి కార్డులు లేని వారికి నామమాత్రపు ఫీజులతో నాణ్యమైన ఆధునిక క్యాథ్ ల్యాబ్ వైద్యసేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ బొర్రా విజయ్‌చైతన్య, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, జీజీహెచ్.

ప్రతిరోజూ హృద్రోగులకు ఓపీ



గుంటూరు జీజీహెచ్ కార్డియాలజీ అవుట్ పేషెంట్ విభాగంలో గుండె జబ్బుల చికిత్స కోసం వచ్చే రోగుల సంఖ్య బాగా పెరిగింది. సుమారు 50 ఏళ్లుగా కార్డియాలజీ ఓపీ వైద్య విభాగంలో వారంలో మూడు రోజులు మాత్రమే వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. ఏప్రిల్ నుంచి ప్రతిరోజూ కార్డియాలజీ ఓపీ వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చాం. గుండె జబ్బుల నిర్ధారణకు అవసరమైన ఈసీజీ, 2 డి ఎకో, ట్రెడ్ మిల్ టెస్ట్ వంటి అన్ని పరీక్షలు కూడా ఓపీ విభాగంలోనే ఏర్పాటు చేశాం.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్.

క్లుప్తంగా

సీఎంపై దాడి అప్రజాస్వామికం
వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం నేతలు



పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై మేమంతా సిద్ధం బస్సు యాత్రలో విజయవాడలో దాడి అప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై షేక్ చెప్పారు. కొత్తపేటలోని వారి కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిద్ధం యాత్రలో కొంత మంది ఆగంతకులు రాయితో దాడి చేసి సీఎం వై.ఎస్.జగన్‌ను గాయపరచడం ఎంతో దుర్మార్గమైన చర్య అన్నారు. నిందితులు ఎంతటివారైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్స్ విభాగం ఉపాధ్యక్షులు బాలకృష్ణ, కోటేశ్వరరావు మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక దాడి చేయించారని మండి పడ్డారు. ప్రజాసంక్షేమం కోసం పాటుపడుతున్న ఆయనకు దేవుడు, ప్రజల ఆశీస్సులు ఉంటాయన్నారు.

అంబేడ్కర్ చిరస్మరణీయుడు



లక్ష్మీపురం: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ తన చివరి శ్వాస వరకు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం కార్యాలయంలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కృషి అవిశ్రాంతంగా తరతరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. డివిజన్ ఏడీఆర్ఎం కె.సైమాన్ మాట్లాడుతూ ఆయన కేవలం విద్యావేత్త మాత్రమే కాదు, ఆర్థిక, రాజకీయ వేత్త, సంఘ సంస్కర్త మహిళలు కార్మిక హక్కుల కోసం పోరాడే వారని అన్నారు. అనంతరం సీనియర్ డీఈఎన్ ఎం.దినేష్‌కుమార్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కె.కమలాకర్‌బాబు, సీనియర్ డీపీఓ షేక్ షాహబాజ్ హనూర్ పాల్గొన్నారు.

ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయండి

బాపట్లటౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు ప్రాంతాల్లోకి ప్రవేశించే ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. సోమవారం జిల్లాలోని వెదుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెక్‌పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలను ప్రలోభాలకు గురి చేయడానికి ఉపయోగించే నగదు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ రవాణాను అరికట్టి, ప్రజలు స్వేచ్ఛగా వారి ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో జిల్లా పరిధిలో 12 చెక్ పోస్టుల్లో సీసీ కెమెరాలు అమర్చడం జరిగిందన్నారు. ప్రజలు ఎన్నికల నియమావళిని పాటిస్తూ వాహన తనిఖీలు చేస్తున్న పోలీస్ సిబ్బందికి సహకరించాలని సూచించారు.

జగనన్నతోనే భరోసా...

- ప్రజలు నమ్ముతున్నది వైఎస్సార్ సీపీనే చెప్పింది చెప్పినట్లుగా చేసే నాయకుడు జగనన్న ఒక్కడే
- గుంటూరు పశ్చిమలో జయకేతనం ఎగురవేస్తాం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- టీడీపీ నుంచి 60 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి విడదల రజిని

పట్నంబజారు: 'మీ ఇంట్లో మంచి జరిగితేనే.. ఓటు వేయండమ్మ..' లేకపోతే వద్దని చెప్పే ధైర్యం రాష్ట్ర రాజకీయాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తప్ప మరెవరికి లేదని, ఆయనతోనే రాష్ట్ర భవిష్యత్ మంచిగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, పార్టీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి విడదల రజిని చెప్పారు. చంద్రమౌళినగర్‌లోని పార్టీ కార్యాలయంలో టీడీపీ నుంచి పార్టీలోకి 60 కుటుంబాలు సోమవారం చేరాయి. హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి టీడీపీకి చెందిన 30 కుటుంబాలు, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు ఝాన్సీ ఆధ్వర్యంలో కన్నావారితోట నుంచి 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి రజిని మాట్లాడుతూ సంక్షేమం అందాలంటే జగనన్నే ముఖ్యమంత్రిగా ఉండాలనే నిర్ణయానికి ప్రజలు వచ్చేశారని తెలిపారు. చరిత్ర ఎరుగని సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తున్న ఖ్యాతి జగనన్నకే దక్కిందని చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. గత ఎన్నికలకు ముందు ఏ హామీలు అయితే ఇచ్చారో వాటిని తూచా తప్పకుండా అమలు చేసిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్ అని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కూడా ఇలానే మరో సంచలన పాలనను అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వివరించారు. ప్రజలు నమ్ముతున్నది వైఎస్సార్ సీపీని మాత్రమేనని, మంచి చేశాం కాబట్టే ప్రజలు వెల్లువలా పార్టీలో చేరుతున్నారని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో గెలిచేది వైఎస్సార్ సీపీ మాత్రమేనని, ఎవరెన్ని కుట్రలు పన్నినా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గెలుపును ఆపలేరని స్పష్టం చేశారు. హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి టీడీపీలో చేరిన వారిలో మస్తాన్, రాజు, సిద్దయ్య, గోపి, లక్ష్మి, సరస్వతి ఉన్నారు. కన్నావారి తోట నుంచి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నజీమా బేగం, షేక్ షకీల, షేక్ నాగూర్ బి, షేక్ ఆషాపున్ , షేక్ ఉష్ణ, చిన్నమ్మాయి, లక్ష్మి, రాధా, షాహినా, నీలు, ధనలక్ష్మి ఉన్నారు.

మాతృమరణాలు సంభవించకుండా చర్యలు

డీఎంహెచ్ఓ విజయలక్ష్మి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: జిల్లాలో మాతృమరణాలు సంభవించకుండా వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి, తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో డీఎంహెచ్ఓ అధ్యక్షతన మాతృమరణాలపై సబ్ డిస్ట్రిక్ లెవెల్ కమిటీ సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. జిల్లాలో మార్చి నెలలో పెదకాకాని, కుంచనపల్లి, ఎర్రబాలెం, ఆరోగ్య కేంద్రాలలో సంభవించిన మూడు మాతృమరణాలకు కారణాలను కమిటీ సభ్యులు సమీక్షించారు. అందులో ఒకటి నివారించదగినదిగాను, రెండు మరణాలు నివారించలేనివిగాను నిర్ధారించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భిణిగా నిర్ధారణ మొదలుకొని కింది స్థాయి వైద్య సిబ్బంది తప్పనిసరిగా క్రమం తప్పకుండా నెలనెలా గర్భిణిని ఫాలో అవ్వాలని చెప్పారు. ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించడం, ముఖ్యంగా రక్తహీనత లేకుండా నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. హై రిస్క్‌గా గుర్తిస్తే ముందస్తుగా కాన్పు ప్రణాళిక సిద్ధం చేసుకుని ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారుల ద్వారా రిఫరల్ ఆస్పత్రుల వైద్య అధికారులకు గర్భిణిని పంపించి అత్యవసరమైతే ఫోన్‌లో కూడా సమాచారం అందజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మాతృమరణాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. సమీక్షలో కమిటీ సభ్యులు డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ సునీత, డాక్టర్ ఆదిత్య ప్రదీప్ రెడ్డి, డాక్టర్ రాధికారాయుడు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డాక్టర్ అన్నపూర్ణ, కె.శాంత కుమారి, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ ఎన్నికల ప్రచారంలో వీఆర్ఏ



వల్లాపల్లి గ్రామంలో టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వీఆర్ఏ షేక్ జాన్‌సాహెబ్

బల్లికురవ: ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన వద్దంటూ ఎన్నికల సంఘం ఉత్తర్వులను విస్మరించి ఓ వీఆర్ఏ పచ్చ కండువా వేసుకుని గ్రామంలో జరిగిన ప్రచారంలో పాల్గొన్నాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వల్లాపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం ప్రకారం గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆయన తనయుడు పాల్గొన్నారు. ఈ ప్రచారంలో గ్రామ వీఆర్ఏగా పనిచేస్తున్న షేక్ జాన్ సాహెబ్ టీడీపీ కండువా వేసుకుని ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నాడు. ఆయనకు తోడు 11వ క్లస్టర్ వలంటీర్ దేవరపల్లి వీరాంజనేయులు కూడా ప్రచారంలో పాల్గొన్నాడు. ఎన్నికల నియావళిని విస్మరించి ప్రచారంలో పాల్గొన్న ఇరువురిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల, గ్రామ స్థాయి నేతలు శనివారం ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు.

మద్యం రహిత ఎన్నికల కోసం నిరంతరం కృషి

ఎస్ఈబీ ఏఎస్పీ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ వెంకటేశ్వరరావు

పట్నంబజారు: రానున్న ఎన్నికల నేపథ్యంలో ఓటర్లపై మద్యం ప్రభావం పడకుండా, మద్య రహిత ఎన్నికల కోసం ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. ఈమేరకు బ్రాడీపేటలోని ఎస్ఈబీ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మద్యం నిల్వలు, ఇతర రాష్ట్రాల నుండి మద్యం, మత్తు పదార్థాలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మద్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించి, ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా లేకుండా విధులు నిర్వహించాలన్నారు. గంజాయి విక్రేతలకు పది సంవత్సరాల్లోపు కఠిన కారాగా శిక్ష, రూ.లక్ష జరిమానా విధించిన కేసులో సమర్థంగా దర్యాప్తు, సాక్షులను ప్రవేశపెట్టిన అధికారులను ఆయన అభినందించారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని, కోర్టులో విచారణలో ఉన్న కేసుల పురోగతిపై సమీక్షించారు. మేడికొండూరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన ఆర్.బుల్లయ్యపై 21.1 కిలోల గంజాయి కలిగి ఉన్న నేపథ్యంలో నమోదైన కేసులో సదరు నిందితుడికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధించిన కేసులో సమర్థంగా నిర్వర్తించిన ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.లత, కోర్టు కానిస్టేబుల్ కోటేశ్వరరావు, ఏఎస్పీ వెంకటేశ్వరరావు, ప్రత్యేకంగా అభినందించడంతో పాటు, రివార్డుకు సిఫార్సు చేశారు. సమావేశంలో ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, ఏఈఎస్ ఎస్.కృష్ణకిశోర్‌రెడ్డి, ఎస్‌హెచ్ఓ పి.విజయకుమార్, బి.లత, మాధవి, ప్రసన్న లక్ష్మి, ఏవీ చలం, సుకన్య, ఎస్ఐలు ప్రభుదాసు, ఇంటిలిజెన్స్ ఎస్ఐ శకుంతలాదేవి, టెక్నికల్ వింగ్ ఎస్ఐ మౌనిక పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పర్చూరు(చినగంజాం): ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం పర్చూరులో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పెద్దివారిపాలేనికి చెందిన రావి విజయభాస్కర్(47) పర్చూరు నుంచి బైక్‌పై తన గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఓ మహిళ లిఫ్టు అడగడంతో ఆమెను ఎక్కించుకున్నాడు. పర్చూరు ఏఎంసీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వారి వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. 108లో చికిత్స నిమిత్తం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ విజయభాస్కర్ మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడ్డ మహిళకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన విజయభాస్కర్‌కు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సంక్షేమ పాలన వైఎస్ జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు
- దుగ్గిరాల మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- హాజరైన అభ్యర్థి లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల



ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న లావణ్య, పక్కన మాజీ ఎమ్మెల్యే కమల

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పేర్కొన్నారు. దుగ్గిరాల మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. మోరంపూడి, చినపాలెం, పెరుకలపూడి ప్రాంతాల్లో నిర్వహించిన ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఎంపీపీ డి.సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణలతో కలసి విస్తృతంగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చూసి వైఎస్సార్ సీపీకి మద్దతు పలకాలని అన్నారు. లంచాలు, వివక్షకు తావులేకుండా విప్లవాత్మక సంస్కరణలతో పేదల ఆకాంక్షకు అనుగుణంగా ప్రజారంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఏ ప్రభుత్వంలో ఎప్పుడూ లభించదని రాజ్యాధికారాన్ని మనకు కల్పించారని చెప్పారు. లావణ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఉన్నప్పటికి బీసీ మహిళ అయిన తనకు టిక్కెట్ ఇచ్చారని, రాబోయే కాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం మన ప్రభుత్వం కృషి చేస్తుందని, ఏ సమస్య వచ్చినా, ఎప్పుడైనా మా ఇంటి తలుపు తట్టవచ్చని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉన్న మా కుటుంబాన్ని గతంలో మీరు ఆదరించారని, భవిష్యత్ తరాలకు మంచి జరగాలంటే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.
కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.రత్నం, నాయకులు వి.రజనీకాంత్, మోరంపూడి, పెరుకలపూడి, దుగ్గిరాల, కఠంరాజుకొండూరు, మంచికలపూడి సర్పంచులు ఇత్తడి రమేష్, గంపల గంగాధర్, బాణావత్ ఖుషీబాయి, ఉన్నం ఝాన్సీ రాణి, యార్లగడ్డ శ్రీచంద్ర దుర్గాభవాని, దాసరి సుందరమ్మ, కొండూరు సుధారాణి, పలుకూరి మేరమ్మ, బి.శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

బీసీలకు బ్యాక్ బోన్ వైఎస్సార్ సీపీ



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కృష్ణయ్య, ఉదయభాను, ఎమ్మెల్సీలు

జగ్గయ్యపేట: బీసీలకు బ్యాక్‌బోన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. పట్టణంలోని ఎస్‌జీఎస్ కళాశాలలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో నియోజకవర్గ బీసీ ఆత్మీయ సదస్సు సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో బీసీలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందారని చెప్పారు. చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని తెలిపారు. చంద్రబాబు ప్రజలను ఓటర్లుగా చూస్తారని జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులుగా చూస్తారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్ వంటి గొప్ప నాయకుడు కావాలంటూ కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే ఉదయభానును గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీల వర్గాలతో పాటు ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ నియోజకవర్గంలో ఐదేళ్లలో కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ముఖ్యంగా ఎన్నడూ లేని విధంగా బీసీలకు ఎంతో ప్రాధాన్యతనిచ్చామని తెలిపారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మాటల సీఎం కాదని చేతల సీఎం అన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసే తాను పోలీస్ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాలలోకి వచ్చానన్నారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు సిద్ధవటం యానాదయ్య మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులను కించపరిచిన చంద్రబాబును రానున్న ఎన్నికలలో మట్టి కరిపించాలని పిలుపునిచ్చారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ నవరత్నాల పథకాల ద్వారా నిరుపేదలకు మేలు జరిగిందన్నారు. అనంతరం ఆర్.కృష్ణయ్య, ఉదయభానును బీసీ సెల్ నాయకులు సత్కరించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి, వడ్డెర, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌లు జింకా విజయలక్ష్మీ, దేవళ్ల రేవతి, తొండమళ్ల పుల్లయ్య, పార్టీ మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేబిరాణి, ముదిరాజ్ హక్కుల సాధన సమితి అధ్యక్షుడు పిల్లి రామారావు, నెడ్‌కాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, నియోకవర్గ పరిశీలకుడు నూతలపాటి హనుమయ్య, యువజన నాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్, ఫైనాన్స్, పూసల, మైనింగ్ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు విజిత, కుమారి, రామారావు, విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ విమలాభాను, నాయకులు పెంటి శ్రీనివాసరావు, శ్రీనివాస గౌడ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



ఉప్పరపాలెంలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ



జోసఫ్‌నగర్‌లో పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అందరికీ అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేబ్రోలులోని ఉప్పరపాలెంకు చెందిన వంద మంది టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. రాందాసు ఆధ్వర్యంలో కాల్వ నాగరాజు, జంపని ప్రేమ్‌కుమార్, కొండా సుబ్బారావు, కమాదుల గోపి, బాపనపల్లి గోవిందమ్మ, గుంజి వీరమ్మ, గుంజి భూలక్ష్మి, తిరుపతమ్మ, ఎల్లంకోటి రాజు, బాపనపల్లి గురవయ్య, జూటూరి అర్జున్, ముద్రబోయిన అనంతలక్ష్మి, ముద్రబోయిన శ్రీను, వల్లెపు ఉషారాణి, పల్లెబోయిన సురేష్ తదితరులు ఉన్నారు.

జోసఫ్ నగర్‌లో 20 కుటుంబాలు...

చేబ్రోలు పాతరెడ్డిపాలెం జోసఫ్ నగర్ ప్రాంతానికి చెందిన 20 కుటుంబాలు సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీలోకి చేరారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ఐకమత్యంలో కృషి చేస్తామని పార్టీలో చేరినవారు ప్రకటించారు. అంబటి మురళీకృష్ణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో వల్లభాపురపు భాస్కరరావు, కనకరాజు, రవికుమార్, రామయ్య, వెంకాయమ్మ, మరియమ్మ, సౌందరయ్య, ఎప్సీబా, నాగమణి, చిన మరియమ్మ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితీ, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు బాణాల ఝాన్సీ, చుక్కా ఆదాం, గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి, షేక్ పెదమస్తాన్, బత్తుల గోవిందరాజులు, వై మమత, జి శ్రీరెడ్డి, బి.అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పల్లెపాటి కోటేశ్వరరావు, బాణాల విజయకుమార్, కొక్కిలగడ్డ కిరణ్ కుమార్, రాయపాటి సుశీలరావు, భాగ్యరాజు, మంచాల భిక్షాలు, మనోజ్, పులి ఏసుబాబు, పులి ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి గళ్లా మాధవిపై ఈఆర్వోకు ఫిర్యాదు



నెహ్రూ నగర్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం నాయకుడు పిల్లుట్ల బాబూరావు ఫిర్యాదు చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎన్నికల అధికారి రాజ్యలక్ష్మికి సోమవారం ఫిర్యాదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన సాయంత్రం టీడీపీ అభ్యర్థి గళ్లా మాధవి, ముత్యాలరెడ్డి నగర్‌లో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారని, ఆ సమయంలో ఆ ప్రాంతమంత తీన్మార్ తప్పెట్లతో అలజడి సృష్టించారని పేర్కొన్నారు. బాణసంచా పేలుళ్లు యథేచ్ఛగా కొనసాగించారని తెలిపారు. ఇవన్నీ ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. ఎన్నికల నియమావళిని అనుసరించి మాధవిపై చర్యలు తీసుకోవాలని కోరారు.